సాక్షి మంచిర్యాల

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



ఈవీ'ఏం తెలుసు'..!

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎంలపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఈవీఎంలు వినియోగంలోకి వచ్చిన వైనంపై ప్రత్యేక కథనం. 8లో▸



స్వచ్ఛ్ సర్వేక్షన్ బృందాల పర్యటన

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట, నాగసముద్రం, మేదరిపేట, నంబాల, గూడెం గ్రామాల్లో స్వచ్ఛ్ సర్వేక్షన్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు సునీల్ కుమార్, సునీల్‌గౌడ రాకేష్ పర్యటించారు. పారిశుధ్యం, వార సంతల నిర్వహణ, డ్రైనేజీలు పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. సాయంత్రం వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పంద్రాగస్టు అతిథులు వీరే..

కైలాస్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా జిల్లా కేంద్రాల్లో ఈ నెల 15న నిర్వహించే వేడుకల్లో పాల్గొనే ముఖ్య అతిథుల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, నిర్మల్ జిల్లాకు రాష్ట్ర అటవీశాఖశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాల జిల్లాకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ఎమ్మెల్సీ సుంకరి రాజును కేటాయించింది. వీరు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వ ప్రగతిపై ప్రసంగించనున్నారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

సబ్‌స్టేషన్ తనిఖీ చేసిన డైరెక్టర్



రైతులతో మాట్లాడుతున్న డైరెక్టర్ గణపతి

లక్సెట్టిపేట: పట్టణంలోని సబ్‌స్టేషన్‌ను వరంగల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సెల్(ఐపీసీ) డైరెక్టర్ గణపతి శనివారం తనిఖీ చేశారు. అనంతరం అక్కడి నుంచి ఎస్‌పీఎం షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందేలా చొరవ తీసుకోవాలని తెలిపారు. రైతులతో మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటల సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడంపై ఏదైనా సమస్య ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఏడీఈ ప్రభాకర్‌రావు, ఏఈ గణేశ్, సబ్ ఇంజినీర్ మల్లేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ట్రాకింగ్ యాప్



డిజిటల్ తెరను వీక్షిస్తున్న ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: టీఎస్ ఆర్టీసీలో బస్సు ట్రాకింగ్ యాప్(గమ్యం) శనివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లో టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు వీక్షించేందుకు రెండు డిజిటల్ తెరలను ఏర్పాటు చేశారు. యాప్‌కు సంబంధించిన విషయాలను అధికారులు వివరించారు. లగ్జరీ, రాజధాని, డీలక్స్ బస్సులు ఏ ఊరు దాటుకుని వచ్చింది..? ఏ స్టేజీలో ఉంది..? స్టేజీ వద్ద ఎంత సేపు ఆగింది..? గమ్యస్థానానికి ఎన్ని గంటలకు బస్సు వస్తుంది..? డ్రైవర్ స్టేజీ వద్ద బస్సు నిలిపాడా.. అనే విషయాలు సులువుగా తెలుసుకునే వీలుంటుంది. బస్సు ఎన్ని గంటలకు గమ్యం(స్టేజ్)కు చేరుతుందనే సమాచారం వస్తుంది. ఈ విధానంలో బస్సు సంఖ్య, లేక సర్వీసు నెంబర్ తెలిస్తే వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ పి.సాల్మన్‌రాజ్ తెలిపారు. ప్లే స్టోర్‌లో టీఎస్‌ఆర్టీసీ గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

మెరిట్ జాబితా ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా సైన్స్ సెంటర్‌లో జిల్లాలోని కేజీబీవీ, యూఆర్ఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి పరీక్ష రాసిన అభ్యర్థుల మెరిట్ జాబితా ప్రకటించారు. శనివారం డీఈవో కార్యాలయం వద్ద నోటీస్ బోర్డుపై 1:1 నిష్పత్తి ప్రకారం 27 మంది జాబితాను ప్రదర్శించగా అభ్యర్థులు పరిశీలించారు. కలెక్టర్ ఆమోదం తెలిపిన తర్వాత ఉత్తర్వులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లతో సిబ్బంది

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామంలో శనివారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. గ్రామానికి చెందిన ఉమ్మల మల్లేశ్వరి ఇంటి వద్ద 44 గుడుంబా ప్యాకెట్లు, రత్నం పోశమల్లు వద్ద 84 గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసిన, విక్రయించిన, నాటుసారా ముడిపదార్థాలు బెల్లం, పటిక రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు అశోక్, సుధాకర్, నెన్నెల పోలీసులు అనంత్ పాల్గొన్నారు.



లీడర్ల దయ.. అర్హుల ప్రాప్తం!



దండేపల్లిలో గృహలక్ష్మి దరఖాస్తు కోసం గురువారం బారులు తీరిన ప్రజలు

- ప్రజాప్రతినిధుల ఎంపికతోనే జాబితాలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వారిదే తుది నిర్ణయం
- ఎన్నికల ముందు పథకాలతో ప్రజల్లో ఆశలు
- జాబితా తుది రూపకల్పనలో రాజకీయ జోక్యం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాల అర్హుల ఎంపికలో రాజకీయ జోక్యం పెరగడంతో లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అర్హుల జాబితాలో తమ పేర్లు ఉండేలా స్థానిక నాయకులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితా సిద్ధం చేస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం అవుతోంది. బీసీలకు రూ.లక్ష సాయంలో పలు చోట్ల జాబితా మారిందని ఆందోళన చెందుతున్నారు. తొలి జాబితాలో తమ పేర్లు మార్చారని అధికార, ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. వరదల సమయంలో ప్రభుత్వ సాయం అందడంలో, సంక్షేమ పథకాలన్నీ ఎమ్మెల్యే చేతుల మీదుగానే అందడంతో అర్హుల ఎంపికలో రాజకీయ జోక్యం తప్పడం లేదు.

'బీసీ సాయం' కోసం ఆరాటం

కులవృత్తులకు రూ.లక్ష సాయం కోసం 11,106 దరఖాస్తులు రాగా, సమగ్ర కుటుంబ సర్వే వివరాల ప్రకారం అర్హులను ప్రత్యేక 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తో ఏరివేయగా.. చివరికి 2,668 మంది మిగిలారు. ఇందులో తొలి దఫా మూడు వేల మందికి నియోజకవర్గంలో వెయ్యి మంది చొప్పున చెక్కులు పంపిణీ చేయాలి. ప్రతీ నెల 15వ తేదీ తర్వాత సాయం అందిస్తామని ప్రకటించడంతో అంతా ఆశలు పెట్టుకున్నారు. మొదట వంద మంది చొప్పున ఒక్కో నియోజకవర్గంలో పంపిణీ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకుని, అర్హులైన వారు తమకే ముందు రావాలని రాజకీయ నాయకుల చుట్టూ తిరిగారు. స్థానిక కౌన్సిలర్ల నుంచి సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీలతో ఎమ్మెల్యేలకు చెప్పిస్తున్నారు. ఎమ్మెల్యేలు సూచించిన జాబితానే చివరికి ఇన్‌చార్జీ మంత్రి వద్ద ఫైనల్ కావడంతో ఎమ్మెల్యే నిర్ణయం కీలకంగా మారింది. జాబితాలో తమ పేర్లు ఉండేలా చూసుకునేందుకు లబ్ధిదారులు నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

'దళితబంధు' లోనూ..

దళితుల ఆర్థిక పరిపుష్టికి తోడ్పాటు అందించేందుకు రూ.10లక్షలు ఇచ్చే దళితబంధు పథకం పై జిల్లాలో ఎంతోమంది ఆశలు పెట్టుకున్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి వంద యూనిట్లు చొప్పున మంజూరు కాగా, అప్పట్లో ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉన్న వారికే ఇస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత ఎమ్మెల్యేలకు సంబంధం లేకుండా ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో కొంతకాలం బ్రేక్‌పడింది. తాజాగా నియోజకవర్గానికి 1100 చొప్పున యూనిట్లు మంజూరు కావడంతో నిరుపేద దళితులు ఆశలు పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు తమకు వచ్చేలా చూడాలని అధికార పార్టీ నాయకులను వేడుకుంటున్నారు.

గృహలక్ష్మి పథకం ఎంపికలో..

ఇల్లు లేని నిరుపేదల కోసం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. మూడు దఫాలుగా రూ.లక్ష చొప్పున మొత్తం రూ3.లక్షలు ఇంటి నిర్మాణం మొదలు పూర్తయ్యేవరకు అందిస్తుంది. నియోజకవర్గానికి మూడు వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయడంతో అర్హుల ఎంపిక క్లిష్టంగా మారింది. దరఖాస్తులు వేలల్లో రావడంతో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక పోర్టల్‌తో ఇళ్ల మంజూరు, బిల్లుల ప్రక్రియ సాగనుంది. ఈ నెల 20వరకు అధికారుల పరిశీలన పూర్తి చేస్తే 25వరకు జిల్లా ఇన్చార్జీ మంత్రి ఆమోదంతో తొలి విడతలో లబ్ధిదారులకు రూ.లక్ష అందించేందుకు ప్రక్రియ సాగుతోంది. దీంతో దరఖాస్తుదారులు తమ పేర్లు ఉండేలా అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో రెండో జాబితాకు సంబంధించి చెక్కులు ఎప్పుడు అందిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

మైనార్టీల రూ.లక్ష పథకం కోసం

మైనార్టీలకు రూ.లక్ష సాయం పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ముస్లింలకు ప్రకటించిన రుణ జాబితా సిద్ధం కాకపోవడంతో వారి పాత దరఖాస్తుల తోపాటు కొత్త క్రిస్టియన్, పార్సీ, సిక్కు, బుద్ధిస్టులు, జైన్ వర్గాలకు ఈ వంద శాతం సబ్సిడీ కింద సాయం అందనుంది. వీటి ఎంపికలో రాజకీయ నాయకులే కీలకంగా కావడంతో లబ్ధిదారులు తమకు తెలిసిన వారి వద్ద తమకు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

పరేడ్ కోసం రిహార్సల్



పరేడ్ మైదానంలో ఏఆర్ పోలీసుల సాధన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంచిర్యాల బస్టాండ్ పక్కన గల పరేడ్ మైదానం(బాలుర పాఠశాల)లో ఈ నెల 15న నిర్వహించే పరేడ్ కోసం పోలీసులు ముందస్తుగా రిహార్సల్ చేస్తున్నారు. బెల్లంపల్లి ఏఆర్ పోలీసులు ప్రతీ ఏడాది పరేడ్ చేపడుతుండగా కలెక్టర్, ప్రభుత్వ ప్రతినిధులు గౌరవ వందనం స్వీకరిస్తారు. ఇందులో భాగంగా మూడు రోజుల ముందుగా పరేడ్ కోసం బెల్లంపల్లి ఏఆర్ పోలీస్ ఏసీపీ మల్లికార్జున్ నేతృత్వంలో పోలీసులు పరేడ్ సాధన చేస్తున్నారు.

వంతెనల నిర్మాణానికి నిధులు

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రి మండలాల్లో నాలుగు వాగులపై వంతెనలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.11.70కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. చెన్నూర్ మండలంలోని చింతలపల్లి, అక్కెపల్లి వాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3.20కోట్లు, మందమర్రి పాలవాగు సండోన్‌పల్లి, శంకర్‌పల్లి వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.2.50కోట్లు, అందుగులపేట వద్ద చెక్‌డ్యామ్‌కు రూ.3కోట్లు, పులిమడుగు వద్ద చెక్‌డ్యామ్‌కు రూ.3కోట్ల చొప్పున మంజూరు చేసిందని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: జిల్లాలోని కేజీబీవీ, మోడల్ అర్బన్ రెసిడెన్సీ స్కూళ్లలో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ ఎదుట శనివారం వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవోకు అందజేశారు. ప్రగతిశీల కేజీబీవీ అండ్ యూఆర్ఎస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.గీత, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి డి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

మళ్లీ భగ భగ

- వంట ఎదిగే సమయంలో వర్షాలు కరువు
- ముఖం చాటేసిన వరుణుడు
- 12రోజుల్లో 13.8 మిల్లీమీటర్లే..
- నెర్రెలు బారుతున్న వరి పొలాలు



కన్నెపెల్లి మండలంలో నెర్రలుబారుతున్న వరి పొలం

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాకాలంలోనూ జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఈ నెలలో వర్షాలు లేక పొలాలు పొడిబారి నెర్రెలు బారుతున్నాయి. గత నెలలో భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రజలు ఈ నెలలో ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు మండిపోతుండగా.. సాయంత్రం అక్కడక్కడ ఓ మోస్తారు వర్షం కురుస్తుందే గానీ భారీగా పడడం లేదు. గత నెలలో సాధారణ వర్షపాతం కన్న రెట్టింపు నమోదు కాగా ఈ నెల ఒకటి నుంచి 12వరకు 13.8 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. మరోవైపు గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. పంటలకు నీటితడి లేక వడలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు కీలకమైన ఆగస్టులో భిన్న వాతావరణం నెలకొంటోంది. ఈ నెలలో భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించేవి. కానీ ఈ ఏడాది వాతావరణ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పటికే పంటలు విత్తుకున్న రైతులతోపాటు ఇంకా వరినాట్లు వేసుకోని రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. చెరువులు, కుంటలు, బోరుబావులు ఉన్న రైతులు మినహా వర్షాధారంపై సాగు చేస్తున్న రైతులు సందిగ్ధంలో ఉన్నారు. గత నెలలో వర్షాలకు నారు పోసుకున్న వారు ఇప్పుడు నీరు లేక నాట్లకు వెనుకంజ వేస్తున్నారు. పత్తి విత్తనాలు వేసుకునే సమయం గత నెలతో ముగిసింది. చాలా చోట్ల వరి పంటలకు నీరందకుండా పోతోంది. దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాల వరి నాట్లకు గడువు ముగియగా.. స్వల్పకాలిక రకం నాట్లకు మాత్రమే నెలాఖరు వరకు అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఈ నెలలో 13.8 మిల్లీమీటర్లు..

జిల్లా సాధారణ వర్షపాతం జూన్ నుంచి ఇప్పటివరకు 598.1మిల్లీమీటర్లు కాగా 649.3 మిల్లీమీటర్లు కురిసింది. సాధారణ వర్షపాతం కన్న 9 శాతం అధికంగానే ఉంది. జూలై 31 వరకు 635.4 మిల్లీమీటర్లు కురువగా, ఈ నెల సాధారణ వర్షపాతం 323 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా.. 12 వరకు 13.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది.

పోయిన నెల వాన ఈ నెల ఎండ..



పోయిన నెల భారీ వర్షాలు, వరదలతో పత్తి చేన్లు నీట మునిగినయి. చెరువులు నిండడడంతో వరి నారు పోసుకున్న ఈ నెలలో ఎండలు మండుతున్నాయి. నారు వేసుకుందామంటే పొలంలో నీళ్లు లేవ్వు. ఇప్పుడే నీళ్లు పెట్టి నారు వేసుకుంటే ఇంకా రెండున్నర నెలలు నీరందక పంట ఎండిపోవుడు అయ్యేటట్లు ఉంది. వానాకాలం ఈసారి దెబ్బతీసేటట్లే ఉంది.

– జాపాటి నారాయణ, నెన్నెల

కీలకమైన సమయం

జిల్లాలో ఈ వర్షాకాలంలో 3.63 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా పత్తి 1.90లక్షలు, వరి 1.60లక్షల ఎకరాలు ఉంటుందని అంచనా వేయగా.. ఇప్పటివరకు 1.60లక్షల ఎకరాల్లో పత్తి, 1.27 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. జూన్‌లో అడపాదడపా కురిసిన వర్షాలకు పత్తి, కంది, మొక్కజొన్న పంటలు విత్తుకున్నారు. ఆశించిన వర్షాల్లేక ఆందోళన చెందారు. జూలై 18నుంచి 28వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పంటలకు మేలు చేయడంతోపాటు లోతట్టు ప్రాంతాల పంటలను నీట ముంచాయి. చెరువులు, కుంటలు మత్తడి దూకి గండ్లు పడ్డాయి. ప్రధాన ప్రాజెక్టుల నుంచి లక్షల క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి వెళ్లింది. అప్పటివరకు జిల్లా సగటున 20శాతం లోటుగా ఉన్న వర్షపాతం జూలై నెలాఖరు వరకు 40శాతం అధికంగా నమోదైంది. అన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా కురిసింది. పది రోజులపాటు ఎడతెరిపి లేని వర్షాలు, వరదలతో కొన్ని చోట్ల పత్తి చేన్లు నీట మునిగి, ఇసుక మేటలు వేశాయి. చేన్లు జౌకిపట్టాయి. ఈ నెల మొదటి వారం నుంచి వర్షాలు విరామం ఇవ్వడంతో రైతులు కలుపు నివారణ, ఎరువులు, చీడపీడల నివారణ, మందుల పిచికారీ చేస్తున్నారు. పంట ఎదుగుదల దశలో వర్షాల్లేక వడలిపోతున్నాయి. మెట్టప్రాంతాల్లోని పత్తి, కంది పంటలు ఎదుగుదల లోపించాయి. మరో నాలుగు రోజులు ఇలాగే కొనసాగితే పంటలో వేసిన ఎరువులు మట్టిలో పోసినట్లేనని రైతులు గుబులు చెందుతున్నారు. ఎండ వేడిమి, ఉక్కపోతను తట్టుకోలేక ఏసీలు, కూలర్ల వినియోగం మళ్లీ పెరిగింది. మరోవైపు పంటలకు బోరుమోటర్ల వినియోగం అధికం కావడంతో విద్యుత్ వినియోగమూ పెరిగింది.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారం

- ఏఐసీసీ సభ్యుడు ప్రేంసాగర్‌రావు



దేవాపూర్‌లో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

కాసిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని దేవాపూర్‌లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీలో భాగంగా చేపట్టిన నియోజకవర్గ పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ గ్రామంలో సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. దళితబంధు, గృహలక్ష్మి, మైనార్టీ రుణాలకు లక్షల్లో దరఖాస్తులు వస్తే మండలంలో వందల్లో కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు మొదలు ఏ పథకమైనా అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేవని తెలిపారు. రాత్రి ఏడున్నర గంటల వరకు దేవాపూర్‌లో నిర్వహించిన పాదయాత్ర గట్రావుపల్లికి వెళ్లింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, నాయకులు బండి ప్రభాకర్, దుర్గం మహేందర్, నాతరి స్వామి, రొడ్డ శారద, ఎంపీటీసీలు మెరుగు పద్మశంకర్, పార్వతి మల్లేష్, ఓసీసీ కాంట్రాక్టు కార్మిక నాయకుడు అన్నం కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బౌలింగ్ చేస్తున్న కలెక్టర్ సంతోష్



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో శనివారం వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు నిర్వహించిన ఐడీఓసీ క్రికెట్ పోటీలను కలెక్టర్ సంతోష్ ఎమ్మెల్యే దివాకర్‌రావు, అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతీలాల్, జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్ సింగ్‌లతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మానసిక, పని ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఈ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితుల్లో అధికారులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ విశిష్ట సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చలనచిత్ర ప్రదర్శన

నస్పూర్: విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందించే విధంగా గాంధీ చిత్రాన్ని ఈ నెల 14 నుంచి 24 వరకు జిల్లాలోని థియేటర్లలో ఉచితంగా ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటలో తెలిపారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు ఉత్సావాల్లో భాగంగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సాధారణ ప్రజలు సైతం చిత్రాన్ని వీక్షించేవిధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

బోదకాల నిర్మూలన మాత్రలు వేయాలి



మాత్రలను పరిశీలిస్తున్న నాగయ్య

మంచిర్యాలటౌన్: జిల్లాలో అర్హులైన అందరికీ బోదకాలు నిర్మూలన మాత్రలు ఇవ్వాలని కీటక జనిత అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య అన్నారు. మంచిర్యాల బస్టాండ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా శనివారం బోదకాల నివారణ మాత్రలను మింగించే శిబిరాలను అసిస్టెంట్ డైరెక్టర్ పరిశీలించి, పలువురికి మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 నుంచి ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, స్వచ్ఛంద కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి మాత్రలను మింగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, రాజీవ్‌నగర్, పాతమంచిర్యాల పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ శ్వేత, డాక్టర్ నాగమణి, సీహో అపర్ణ, శ్రీనివాస్, నితిన్, డిపో మేనేజర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నేటి నుంచే ఇంటింటికీ పంపిణీ

మంచిర్యాలటౌన్: బోదకాల నివారణ మాత్రలను రెండేళ్ల పైబడిన వారికి జిల్లాలోని అన్ని బూత్‌లలో వేసే కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ నెల 10న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, మూడు రోజులపాటు బూత్‌ల వద్దకు వచ్చిన ప్రజలకు బోదకాల నివారణ మాత్రలు వేశారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 34 బూత్‌లలో మూడు రోజుల్లో 2,69,701 మందికి మాత్రలు వేసినట్లు జిల్లా కీటక జనిత నివారణ అధికారి డాక్టర్ అనిత తెలిపారు. 13 నుంచి 22వరకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మాత్రలు వేసుకోని వారికి వేయనున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: మహిళల చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. శనివారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ సదయ్య మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందని అన్నారు. చట్టాలపై అవగాహన లేక మహిళలు కష్టనష్టాలకు గురవుతున్నారని తెలిపారు. బాలికలు, మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, ఆ దిశగానే పోలీసు శాఖ చిత్తశుద్ధితో పని చేస్తోందని వివరించారు. బాలికలు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. ఏదైనా ఆపద వస్తే భయపడకుండా వెంటనే 100కు డయల్ చేయాలని, మహిళల రక్షణ కోసం పోలీసులు 24 గంటలు పని చేస్తున్నారని వివరించారు. తాళ్లగురిజాల ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లూర్ గ్రామంలో జరిగిన దాడి ఘటనలో నలుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. గ్రామానికి చెందిన గోమాసి ప్రభాకర్, అతని కుటుంబసభ్యులపై శుక్రవారం రాత్రి బెజ్జూర్ మండలంలోని నలుగుపల్లి గ్రామానికి చెందిన సెగ్యం శేఖర్, సెగ్యం తిరుపతి, సెగ్యం రాజు, సెగ్యం వెంకటేశ్ దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

ఆటోను ఢీకొట్టిన బొలేరో వాహనం


నుజ్జునుజ్జయిన ఆటో

భీమిని: అతివేగంగా, అజాగ్రత్తగా బొలేరో వాహనం వచ్చి ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జు కాగా ట్రాక్టర్ ఇంజిన్ దెబ్బతింది. ఈ సంఘటన మండలంలోని వీగాం బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన బొలేరో వాహనం పాముకాటుకు గురైన గట్టం రాజశేఖర్‌ను తీసుకొని కొంచెల్లికి వెళ్తుండగా వీగాం వద్ద ఆటోతోపాటు ట్రాక్టర్‌ను సైతం ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయి డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఆయిల్ల సైమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుడి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు అనుదీప్

బెల్లంపల్లి: గంజాయిని అక్రమంగా రవాణా చేసి అమ్మకాలు సాగిస్తున్న ఓ యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి బాల్మీకి అనుదీప్ పారిపోయేందుకు యత్నించాడు. పట్టుకుని తనిఖీ చేయడంతో బ్యాగులో గంజాయి ప్యాకెట్లు లభించాయి. 500 గ్రాముల వరకు ఉంటుందని అంచనా వేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో మహారాష్ట్రలోని బల్లర్షా నుంచి గంజాయిని కొనుగోలు చేసి బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలోని యువకులకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

ఈవీఎం తెలుసు..!

సండే స్పెషల్

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తోంది. ఓటింగ్‌లో కచ్చితత్వానికి వినియోగిస్తున్న వీవీ పాట్‌లపైనా వివరిస్తోంది. ఈవీఎంలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో చెల్లని ఓట్లకు చెక్ పడింది. భారీయెత్తున కాగితం వినియోగమూ తగ్గింది. – సాక్షి, మంచిర్యాల డెస్క్

- ఎన్నికల నిర్వహణలో కీలకం
- చెల్లని ఓట్లకు చెల్లు చీటి
- ఓటింగ్‌లో కచ్చితత్వానికి వీవీ ప్యాట్
- ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓటు కచ్చితత్వం



ఓటు కచ్చితత్వానికి వీవీ ప్యాట్(ఓటరు వెరిఫైయేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) వినియోగిస్తున్నారు. ఓటు వేయగానే ఒక స్లిప్‌పై సీరియల్ నంబరు, అభ్యర్థి పేరు, గుర్తు ప్రింట్ అయి బాక్సులో పడుతుంది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల్లో 315కోట్ల ఓట్లు పోలయ్యాయి.

ఒకే ఎన్నిక.. 25వేల బ్యాలెట్ యూనిట్లు

2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంటు స్థానానికి అత్యధికంగా 185మంది బరిలో నిలిచారు. పార్లమెంటు నియోజకవర్గంలోని 1,788 పోలింగ్ కేంద్రాల్లో మొత్తంగా 25వేల బ్యాలెటింగ్ యూనిట్లు, 2000 కంట్రోల్ యూనిట్లు, 2000 వీవీప్యాట్లు వినియోగించి ఎన్నిక నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 12బ్యాలెట్ యూనిట్లు, ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీ ప్యాట్ అమర్చారు. రికార్డు స్థాయిలో అభ్యర్థులు బరిలో నిలిచినా ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించడం దేశంలోనే ఇది మొదటిసారి.

ఇలా మొదలై..


బ్యాలెట్ బాక్సు, పేపర్ స్థానంలో ఈవీఎం తీసుకురావడానికి ఎన్నికల సంఘం 1977లో హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)ను సంప్రదించింది. దీంతో 1979లో నమూనా ఈవీఎంను రూపొందించింది. దీన్ని ఎన్నికల సంఘం 1980 ఆగస్టు 6న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించింది. ప్రభుత్వ రంగంలోని మరో సంస్థ బెంగళూర్‌లోని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్(బెల్)తో కలిసి ఈసీఐఎల్ ఈవీఎలను తయారు చేసింది.

వినియోగంలోకి..

1982లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఈవీఎంలను మొదటిసారి వినియోగించారు. కానీ వినియోగానికి సంబంధించి నిర్దిష్ట చట్టం లేకపోవడంతో ఆ ఎన్నికలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఎన్నికల్లో ఈవీఎంల వినియోగానికి సంబంధించి ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పార్లమెంటులో 1989లో సవరించారు. ఆ తర్వాత 1998లో మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లోని 25 శాసనసభ నియోజకవర్గాల్లో ఈవీఎంలను వినియోగించారు. 1999 ఎన్నికల్లో 45 పార్లమెంటరీ స్థానాల్లో, 2000లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 45 అసెంబ్లీ స్థానాల్లో వినియోగించారు. 2001లో తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమబంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఈవీఎంలను ఉపయోగించారు. అప్పటి నుంచి ప్రతీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం ఈవీఎంలనే వినియోగిస్తోంది. 2004లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో దేశంలోని 543 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈవీఎంలు వినియోగించారు.


అవగాహన కల్పించే నమూనా ఈవీఎం

ఎప్పటికప్పుడు మార్పులు


బ్యాలెటింగ్ యూనిట్

ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్ ఉంటాయి. ఐదు మీటర్ల కేబుల్‌తో ఈ రెండింటిని అనుసంధానం చేస్తారు. బ్యాలెటింగ్ యూనిట్‌లో 16 మంది అభ్యర్థుల గుర్తులు, పేర్లుంటాయి. 2006 కంటే ముందు ఎం1, ఆ తర్వాత ఎం2 ఈవీఎంలు ఉండగా.. నాలుగు బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్టంగా 64 మంది(నోటాతో కలిపి) అభ్యర్థులు బరిలో ఉన్నా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. 2006 తర్వాత ఎం3 ఈవీఎంలను తయారు చేయగా.. 24 బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్టంగా నోటాతో కలిపి 384 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ఎన్నికలు నిర్వహించవచ్చు. ఒకే కంట్రోల్ యూనిట్ అవసరం అవుతుంది.

కలెక్టరేట్లలో అవగాహన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఉన్నాయి. ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో ఈవీఎంలను ప్రదర్శిస్తూ సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పెండింగ్ కేసుల వివరాలు పరిశీలించాలి


మాట్లాడుతున్న డీజీఎం అరవిందరావు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల పెండింగ్ కేసుల వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు సూచించారు. శనివారం ఆయన ఏరియా సంక్షేమ అధికారులు, లా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగుల క్యాడర్‌స్కీంకు సంబంధించిన అంశాలను ఉద్యోగులకు తెలియజేయాలని అన్నారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌కు సంబంధించిన అంశాలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఖాతాలను ఫార్మర్ లేదా సర్వైవర్ ఖాతాలుగా మార్చుకోవడానికి సూచనలు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవై పీఎంలు వీ.రాజేశ్వర్ రావు, వీ.దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సంక్షేమ అధికారులు సునీల్, రణదీప్‌గౌడ్, గౌస్‌పాషా, సంతన్, పాల్‌సృజన్, అజ్మీర రమేశ్, సీనియర్ లా ఆఫీసర్ పాల్గొన్నారు.

కేబీ థియేటర్ వద్ద ఆందోళన


థియేటర్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రేక్షకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేబీ థియేటర్ వద్ద శనివారం నిర్వాహకులకు, ప్రేక్షకుల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ప్రస్తుతం ఇక్కడి థియేటర్‌లో మెగాస్టార్ చిరంజీవి నటించిన భోళా శంకర్ సినిమా నడుస్తోంది. మధ్యాహ్నం 2.30 గంటలకు షోను రెండవ భాగం వేసి కేవలం గంటలోపే సినిమాను పూర్తి చేయడంపై ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ టికెట్ల డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రేక్షకులు డిమాండ్ చేయగా ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు ఇవ్వమని, కావాలంటే మొదటి భాగం తిరిగి వేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ప్రతిరోజు ఇలానే ఏదో సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రేక్షకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి థియేటర్ సక్రమంగా నడిచేలా చర్యలు చేపట్టాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలి

జైపూర్: రెండేళ్లుగా పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించినప్పటికీ పరిష్కారం కాలేదని, కార్మికుల సమస్యలు పరిష్కారం కాని పక్షంలో సమ్మెకు సిద్ధం కావాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో కార్పొరేట్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చూపాలని తెలిపారు. స్థానిక భూనిర్వాసిత, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేని పక్షంలో సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి విక్రం, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, సెక్రెటరీ సాయికృష్ణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్, ఎలుక రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు రామగిరి మల్లేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

బాలుడిపై కుక్కల దాడి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కొసర్‌నగర్ (14వ వార్డు)లో శనివారం సాయంత్రం కుక్కలు దాడి చేయడంతో అస్గర్ అనే బాలునికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇటీవల కాలంలో పట్టణంలోని పలు వార్డుల్లో పిచ్చి కుక్కల స్వైర విహారం పెరిగిందని, అధికారులకు సమాచారం అందించినప్పటికీ నివారణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గనులు సందర్శించిన అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6, ఆర్‌కే 5, ఆర్‌కే7 గనులను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్, థర్డ్ పార్టీ మైన్స్ వెరిఫికేషన్ కమిటీ అధికారులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు భూగర్భ గనుల పరిసర ప్రాంతాల్లో పెంచుతున్న మొక్కలు, ఫిల్టర్‌బెడ్ నిర్వహణ అంశాలను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సుదీప్త ముఖోపాధ్యాయ, ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, శ్రీరాంపూర్ ఏరియా ఎన్విరాల్‌మెంటల్ అధికారి హనుమాన్‌గౌడ్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ అడిషనల్ మేనేజర్లు తిరుపతి, బాబ్జీ, డిప్యూటీ మేనేజర్ పోచమల్ల, ఎస్‌ఓఎం తిరుపతి, గని రక్షణ అధికారి కే.శ్రీనివాస్, సర్వే అధికారి ఎస్‌పి.వర్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కే 6 గని వద్ద అధికారులు

రైల్వే ఆదాయం ఆన్‌లైన్‌లో ఆటాడేశాడు..!

- రూ.34.16లక్షలు హుమకాకి
- బెల్లంపల్లిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం

బెల్లంపల్లి: అతడు రైల్వేస్టేషన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి. రోజువారీగా టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని సంబంధిత బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. కానీ.. రోజూ వేలాది రూపాయలు చేతిలో కనిపిస్తుండడంతో ఆలోచన వక్రమార్గం పట్టింది. రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆదాయాన్ని ఆన్‌లైన్‌లో తీన్‌పత్తి, క్యాసినో గేమ్ ఆడేశాడు. ఏకంగా రూ.34.16లక్షలు పోగొట్టడం రైల్వే అధికారులు, ఇన్ఫోసిస్ క్యాష్ మేనేజ్‌మెంట్ సిస్టం ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహకులను నివ్వెరపరిచింది. రైల్వే టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని రోజువారీగా పలు రైల్వేస్టేషన్ల వారీగా సేకరించి సంబంధిత బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఇందుకు గాను రైల్వే శాఖ ఆ విభాగాన్ని ఇన్ఫోసిస్ క్యాష్ మేనేజ్‌మెంటు సిస్టం ప్రైవేటు లిమిటెడ్‌కు కట్టబెట్టింది. బెల్లంపల్లి ప్రాంతంలోని పలు రైల్వేస్టేషన్లలో టికెట్ల ఆదాయాన్ని సమీకరించి బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేయడానికి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన బెల్లంపల్లి రైల్వే కాలనీకి చెందిన బడే శ్రీపతిబాబు ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంపాటు నమ్మకంగా పని చేసి ఆ తర్వాత అందులో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని డబ్బు స్వాహా చేశాడు. రోజువారీ ఆదాయాన్ని బ్యాంకులో జమ చేయకుండా నకిలీ స్టాంప్‌లు తయారు చేసి వోచర్లపై ముద్రవేసి బ్యాంకులో జమ చేసినట్లుగా వాటిని కరీంనగర్ బ్రాంచ్ అధికారులకు పంపించేవాడు. దక్షిణ మధ్య రైల్వే కమర్షియల్ అధికారుల లెక్కల్లో భారీగా తేడా రావడంతో గుట్టుగా ఆరా తీసి మోసాన్ని గుర్తించారు. ఇన్ఫోసిస్ క్యాష్ మేనేజ్‌మెంటు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితుడు శ్రీపతిబాబును బెల్లంపల్లి టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా, రైల్వే టికెట్ల ఆదాయాన్ని నిందితుడు శ్రీపతిబాబు ఆన్‌లైన్ ఆటల్లో పోగొట్టినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడే అలవాటు ఉందని, తీన్‌పత్తి, క్యాసినోతోపాటు బిట్‌కాయిన్‌లో రూ.32లక్షలు పోగొట్టుకున్నానని చెప్పినట్లు తెలుస్తోంది. నిందితుడి స్థిర, చరాస్తులపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో మరెన్ని అంశాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సిందే.

సైబర్ వలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

- రూ. 1.70 లక్షలు నష్టపోయిన వైనం



సైబర్ నేరగాళ్లకు ఫోన్‌పే ద్వారా పంపించిన నగదు

కౌటాల: నిరక్ష్యరాసులతో పాటు అక్షరాస్యులు కూడా సైబర్ నేరగాళ్ల వలలోపడి మోసపోతున్నారు. బెజ్జూర్ మండలంలోని కుంటాలమానెపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నైతం లత్రశ్రీ కౌటాల మండలంలోని ఇప్పలగూడ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది. ఫేస్‌బుక్‌లో వచ్చిన వ్యాపార ప్రకటనలోని ఫోన్ నంబర్లను సంప్రదించింది. ధనీ బ్యాంకు పేరుతో 9038683321 నంబర్ నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. ఈ నెల 2న రూ.50 లక్షల రుణం మంజూరు చేస్తున్నట్లు ఫోన్‌ద్వారా సందేశం పంపించారు. దీంతో పాటు సైబర్ నేరగాళ్లు ఆధార్, పాన్‌కార్డుతో పాటు ఆమె ఖాతా నంబర్ కలిగిన రూ.50 లక్షల బ్యాంకు చెక్కు వంటి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను వాట్సాప్ ద్వారా పంపించారు. వివరాలను పోల్చి చూసిన బాధితురాలు వారిని నమ్మి లావాదేవీలు జరిపారు. ఆగస్టు 2 నుంచి 11వ తేదీ వరకు పలు దఫాలుగా రూ.1.70 లక్షల నగదును పేటీఎం, ఫోన్‌పేల ద్వారా చెల్లించారు. మరిన్ని చార్జీలు చెల్లిస్తేనే రూ.50 లక్షల రుణం మీ ఖాతాలో జమ అవుతుందని సదరు వ్యక్తులు తెలపడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. కౌటాల ఎస్సై మధుకర్, సీఐ సాధిక్‌పాషాలకు ఫిర్యాదు చేయడంతో సైబర్ విభాగంలో ఫిర్యాదును నమోదు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ర్యాలీలో నాయకులు, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నేతలు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని, పీఆర్‌సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. జూలై 1నుంచి ఐఆర్ అమలు చేయాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ జిల్లా నాయకులు గోళ్ల రామన్న, గుర్రాల రాజావేణు, రమేష్, మోతే జయకృష్ణ, లక్ష్మణ్, విష్ణు, కిరణ్, దిలీప్, విజయ్, సాయిబాబు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం పట్టణంలోని నీలకంఠేశ్వరరావు ఆస్పత్రి ఆవరణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్మకూరి మల్లిఖార్జున్, ఉపాధ్యక్షులుగా బొల్లం రంజిత్‌కుమార్, మడుగుల స్వామి, ప్రధాన కార్యదర్శిగా రేచవేణి సదన్, సంయుక్త కార్యదర్శులుగా బద్రి గోపికృష్ణ, మంచిర్యాల మల్లన్న, ప్రేమలత, కోశాధికారిగా పున్నం పాదం, ప్రచార కార్యదర్శి గడిల విజయ్, టి.సన్నీ, ఎం.జోత్స్న, కార్యవర్గ సభ్యులుగా కాసిపేట స్వామి, గొడిసెల నవీన్, రాజేష్, శ్యామ్ ఎన్నికయ్యారు. సినిమా, యూట్యూబ్ రంగాల్లో ఆర్టిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని కార్యవర్గం ప్రకటించింది. మంచిర్యాల జిల్లాలోని మూవీ, యూట్యూబ్ ఛానల్స్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కళాకారులు పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

విద్యార్థులపట్ల హెచ్‌ఎం అసభ్యకర ప్రవర్తన

బెజ్జూర్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు వారి పాలిట శాపంగా మారాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరాం ఈ నెల 9న రాత్రి సమయంలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం బయటికి వస్తే సమాజంలో తమ పరువు పోతుందని సదరు విద్యార్థిని తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడినట్లు సమాచారం. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు పార్థిరాంను 'సాక్షి' సంప్రదించగా నాపై కావాలనే ఇలా చేస్తున్నారని, తొమ్మిది, పదో తేదీల్లో నేను పాఠశాలలో అందుబాటులో లేనని, తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చాలాకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నప్పటికీ ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో గిరిజన నాయకులు సిడాం సకారాం, తిరుపతి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుష్పలత

ఎన్‌ఈపీ-2020 రద్దు చేయాలి

మంచిర్యాలఅర్బన్: నూతన విద్యావిధానం-2020 ద్వారా ప్రభుత్వం విద్యారంగాన్ని కేంద్రీకరణ, వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నాన్ని టీఎస్‌యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న అన్నారు. శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్‌టీఎఫ్ఐ 24వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ కార్యకర్త కై లాసం ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు, కోశాధికారి కిరణ్, కార్యదర్శి కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులు వాహిద్, తిరుపతి, రాములు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.